# చేప ప్రసాదం పంపిణీ..భారీగా తరలివచ్చిన జనం

- కిక్కిరిసిన ఎగ్జిబిషన్ మైదానం
- ప్రసాదం స్వీకరించిన ప్రముఖులు



నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం బయట కిక్కిరిసిన అస్తమా వ్యాధిగ్రస్తులు, వారి సహాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు చేపమందు వేస్తున్న బత్తిని సోదరులు

అబిడ్స్, సుల్తాన్‌బజార్, జూన్ 8 : మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బత్తిని సోదరులు పంపిణీ చేసే చేప ప్రసాదాన్ని స్వీకరించేందుకు తరలి వచ్చిన ఉబ్బస వ్యాధిగ్రస్తులతో మైదానంతో పాటు నాంపల్లి పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ప్రతి సంవత్సరం బత్తిని సోదరులు మృగశిర కార్తె సందర్భంగా చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తారు. ఈ చేప ప్రసాదాన్ని స్వీకరించేందుకు గాను నగరంతో పాటు పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల వారు తరలి వచ్చారు. శనివారం ఉదయం శాసనసభ స్పీకర్ ప్రసాదరావు, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, అధికారులతో కలిసి బత్తిని కుటుంబీకులు చేప ప్రసాదం పంపిణీని ప్రారంభించారు. చేప ప్రసాదం ప్రారంభం సందర్భంగా ఎలాంటి తొక్కిసలాట చోటు చేసుకోకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఉదయం ప్రారంభమైన చేప ప్రసాదం పంపిణీ ఆదివారం ఉదయం వరకు పంపిణీ చేయనున్నారు. చేప ప్రసాదాన్ని పురస్కరించుకుని ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పకడ్బందీగా బారికేడ్‌లతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా మొబైల్, తాత్కాలిక మరుగు దొడ్లను ఏర్పాటు చేశారు. అగ్నిమాపక శాఖ వారు ఫైరింజన్‌లను అందుబాటులో ఉంచారు. వైద్య శాఖ వారు వైద్య శిబిరాలను నిర్వహించారు. పోలీస్ అధికారులు కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశారు. రెవెన్యూ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేలాదిగా చేప ప్రసాదానికి తరలి రావడంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. అజంతాగేట్ వద్ద గతంలో మాదిరిగా కాకుండా



ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం వేస్తున్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్

పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి బారికేడ్‌లను ఏర్పాటు చేసి అక్కడి నుంచి వెళ్లడానికి నిరాకరించారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు.

**32 కౌంటర్‌ల ద్వారా చేప ప్రసాదం పంపిణీ..**

చేప ప్రసాదం పంపిణీని పురస్కరించుకుని 32 కౌంటర్‌ల ద్వారా చేప ప్రసాదాన్ని పంపిణీ చేశారు. టోకెన్‌లు తీసుకున్న వారు క్యూలైన్లలో నిలబడి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభమైన తరువాత చేప ప్రసాదాన్ని స్వీకరించడం జరిగింది. రాత్రి వరకు దాదాపు అరవై వేల టోకెన్‌లను విక్రయించినట్లు మత్స్య శాఖ అధికారులు తెలిపారు.

**భారీ పోలీస్ బందోబస్తు..**

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అన్ని పోలీస్ స్టేషన్‌ల అధికారులు, సిబ్బంది, హెడ్‌క్వార్టర్స్ ప్లాటూన్, హోంగార్డ్ ప్లాటూన్, మహిళా పోలీసులు పదిహేను వందల మందితో బందోబస్తు చేపట్టారు.



మహిళకు చేప ప్రసాదం వేస్తున్న సతీశ్

## అసదుద్దీన్ ఒవైసీకి సన్మానం



లోక్‌సభ ఎన్నికలలో హైదరాబాద్ ఎంపీగా ఐదో సారి గెలిచిన ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని శనివారం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు మహ్మద్ ముర్తుజా అలీ పహిల్వాన్ తదితరులు పాల్గొన్నారు.
– మెహిదీపట్నం, జూన్ 8

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఈవో దేవనాథానికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

చిక్కడపల్లి, జూన్ 8 : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం కార్యనిర్వాహణాధికారి మాచర్ల దేవనాథం అన్నారు. చిక్కడపల్లి లోని ఆంజనేయ స్వామి ఆలయం, ముషీరాబాద్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని దేవనాథం ప్రారంభించారు. డాక్టర్ అప్సర నేతృత్వంలో వైద్య బృందం పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు.

## కాలుష్యంతోనే వ్యాధులు..



కాలుష్యం, ఆహారపుటలవాట్ల కారణంగా అనేక రకాల వ్యాధులు సంభవిస్తున్నాయని మున్నూరుకాపు విద్యార్థి ట్రస్టుబోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్. వెంకట్‌రావు అన్నారు. మున్నూకాపు విద్యార్థి ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ డి. ప్రతిభ పాల్గొని షుగర్, కంటి, బీపీ, నరాలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసి, మందులను అందజేశారు. డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు, కంటి డాక్టర్ టి. రాజు, సంజన, అశుతోశ్ పాల్గొన్నారు. – కాచిగూడ

## గో సంతతిని రక్షించాలి..

● భారతీయ ప్రాణిమిత్ర సంఘ్ డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ ప్రాణిమిత్ర సంఘ్ ప్రతినిధులు

రవీంద్రభారతి, జూన్ 8 : బక్రీద్‌ను పురస్కరించుకొని హైదరాబాద్ నగరానికి వివిధ జిల్లాల నుంచి నగరానికి తరలిస్తున్న గోసంతతిని రక్షించాలని భారతీయ ప్రాణిమిత్ర సంఘ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గోవులను రక్షించడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సంఘ్ ఆరోపించింది. గోరక్షణకు తక్షణమే చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని సంఘ్ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ్ అధ్యక్షుడు సి.ఎ. జస్‌రాజ్ శ్రీశ్రీమాల్, కార్యదర్శి మహేశ్‌అగర్వాల్ మాట్లాడుతూ.. నగరానికి నిత్యం వేలాది ఆవులు, ఎద్దులు, దూడలు అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ చెక్ పోస్టుల వద్ద పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టివాటిని తిరిగి స్వస్థలాలకు పంపాలని, లేకపోతే ఈ నెల 10వ తేదీ నుంచి రోడ్లపైకి వచ్చి ఆవులను తరలిస్తున్న లారీలను పట్టుకొని వాటిని స్వస్థలాలకు తరలిస్తామని వారు హెచ్చరించారు. రాష్ట్రంలో గోరక్షణ చట్టం ఉన్నప్పటికీ అమల చేయడలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు రిదేశ్‌జాగిర్దార్, జస్మత్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలోకి చేరిన వరద నీరు

## భారీ వర్షం..జలమయమైన బస్తీలు

ముషీరాబాద్, జూన్ 8: భారీ వర్షానికి ముషీరాబాద్ నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీలు జలమయమయ్యాయి. శనివారం మధ్యాహ్నం దాదాపు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలతోపాటు ప్రధాన రోడ్లపై వరద నీరు చేరడంతో జనజీవనం స్తంభించిపోయింది. పల్లపు ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీటితో లోతట్టు ప్రాంతాలైన బాపూజీనగర్, గంగపుత్ర కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, వినోబానగర్, గణేశ్‌నగర్ ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. మరో వైపు ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. అంతేగాక వీఎస్‌టీ, భోలక్‌పూర్ ప్రధాన రోడ్లపై భారీగా వరద నీరు చేరి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది.

## ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి : ఎమ్మెల్యే వెంకటేశ్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జూన్ 8: ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంబర్‌పేట త్వైకాండో అకాడమీ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీలో శనివారం కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ జరిగింది. అనంతరం బెల్టులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే వాటిని అందజేశారు. ఈ సందర్భంగా.. మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో కరాటే ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని అన్నారు. ముఖ్యంగా బాలికలు కరాటే నేర్చుకోవడం చాలా మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ మహ్మద్ కలీల్, సహాయకులు నీరజ దీపిక, మహ్మద్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఘంటసాల గాంధర్వ గానామృతం..

రవీంద్రభారతి, జూన్ 8: ఇం టర్‌నేషనల్ ఇన్‌సానియత్‌కి కిద్‌మత్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు స్వర సమ్రాట్ డా.టి.శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో ఘంటసాల గాంధర్వ గానామృతం, 12 మంది సామాజక సేవకులకు సేవారత్న, న్యాయరత్న, కళారత్న అవార్డులను బహూకరించనున్నట్లు శరత్‌చంద్ర ఓ పత్రికా ప్రటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు న్యాయవాది డా. ప్రసాద్ విచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించి అవార్డులను బహూకరించనున్నట్లు శరత్ చంద్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ శాహిక్ అబ్దుల్ రహమాన్, శాహిక్ జాఫర్ అస్లమ్ విచ్చేస్తారని తెలిపారు. అనంతరం స్వరసమ్రాట్ డా.టి. శరత్ చంద్ర, గాయని శివరమ్య ధరణి ప్రగడ సంయుక్త ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాభిమానులు విచ్చేసి విజయవంతం చేయాలని అన్నారు.

## జీహెచ్ఎంసీ కార్మికులకు చీరల పంపిణీ




జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న సుశీల, విజితారెడ్డి

కాచిగూడ, జూన్ 8: పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన అవసరం ఉందని ఆర్మీస్కూల్ ప్రిన్సిపాల్, ఎన్ఆర్ఐ సుశీల దూది అన్నారు. విమల సుధాకర్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ దేవిరెడ్డి విజితారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కుచికుళ్ల విమల సుధాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బర్కత్‌పుర బస్‌డిపో సమీపంలో జీహెచ్ఎంసీ కార్మికులకు ఉచితంగా చీరలు, బ్రీతింగ్ లైజర్స్, సానిటైజర్, పండ్లు, బ్రేడ్ ప్యాకెట్లు సుశీల, విజితారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుశీల హాజరై మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు మగవాళ్లే వర్ధంతులు, తదితర కార్యక్రమాలు చేస్తారన్న అపోహలను ఆడవాళ్లు కూడా చేస్తారని దేవిరెడ్డి విజితారెడ్డి నిరూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శ్వేతారెడ్డి పాల్గొన్నారు.

## రేణుక అమ్మవారి వార్షికోత్సవం



అంబర్‌పేట ప్రేంనగర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి 11వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మ, సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి పాల్గొన్ని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కార్పొరేటర్‌ను సన్మానించారు. – అంబర్‌పేట



రాంనగర్ జెమినీ కాలనీ పోచమ్మదేవాలయంలో శనివారం ఎన్ఆర్ఐ ఆనందేశి రాజేందర్ ఆధ్వర్యంలో అమ్మవారి గర్భాలయ ముఖ ద్వారానికి వెండి తొడుగు ఏర్పాటు పనులు మొదలయ్యాయి. ఇందుకోసం 20 కిలోల వెండిని ఆలయ కమిటీ సభ్యులకు అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. – ముషీరాబాద్

## మల్లేపల్లిలో నాంపల్లి ఎమ్మెల్యే పర్యటన



ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అందించడానికి అధికారులు కృషి చేయాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మల్లేపల్లి డివిజన్‌లో టెక్కికి మసీద్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు పలు సమస్యలపై విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని అన్నారు. – మెహిదీపట్నం





మృగశిర కార్తె ప్రారంభం సందర్భంగా చేపలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు తరలిరావడంతో ముషీరాబాద్ చేపల మార్కెట్ కిక్కిరిసింది. దీంతో చేపల వ్యాపారులు ఒక్కసారిగా చేపల ధరలు పెంచి అమ్మినట్లు వినియోగదారులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారులు తూకాల్లో కూడా అవకతవకలు జరిపినట్లు పలువురు తెలిపారు. – ముషీరాబాద్

## అక్షర యోధుడు రామోజీ రావు మృతి చెందడం బాధాకరం



సుల్తాన్‌బజార్, జూన్ 8 : తీవ్ర అనారోగ్యంతో అక్షర యోధుడు రామోజీ ఫిలిం సిటీ అధినేత పద్మశ్రీ అవార్డు గ్రహీత చెరుకూరి రామోజీ రావు మృతి చెందడం చాలా బాధాకరమని తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి క్రిష్ణమాచారి సంతాపాన్ని వ్యక్తం చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులకు జర్నలిస్టులకు తన సంస్థల ద్వారా ఉద్యోగ అవకాశాలను కల్పించి వారి కుటుంబ జీవనానికి భృతి కల్పించిన గొప్ప యోధుడని అన్నారు. తన కలంతో సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను తొలగించడానికి కృషి చేసిన గొప్ప త్యాగశీలి అని వారు కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో జేఏసీ కన్వీనర్ పరాశరం రవీంద్రా చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్రం చంద్రశేఖర్, అర్చక అధ్యక్షులు చింతపట్ల బద్రీనాథీచార్యులు, గ్రేటర్ అధ్యక్షుడు బండారి జగపతి, గట్టు శ్రీనివాసాచార్యులు, చక్రధర్, సురేశ్, గణేశ్ తదితరులు ఉన్నారు.

## పత్రికా భాష ఆధునికీకరణకు రామోజీ కృషి ఎనలేనిది

● ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జె. చెన్నయ్య

తెలుగు యూనివర్సిటీ, జూన్ 8: తెలుగు పత్రికా భాషను ఆధునికీకరించడంలో రామోజీరావు చేసిన కృషి విప్లవాత్మకమైందని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య అన్నారు. రామోజీ రావు మృతి పట్ల వారు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పత్రికలో కొత్త పదాలను సృష్టించడంలో రామోజీరావు ఒక దిక్సూచిగా, మార్గదర్శిగా వ్యవహరించారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. పత్రికా భాష ఏకరూపత సాధించడంలో రామోజీరావు అనితర సాధ్యమైన కృషిని తన పత్రిక ఈనాడు ద్వారా సాధించారని అన్నారు. ఆయన లేని లోటు పత్రికారంగానికి తీరనిదని వారు అన్నారు.

## నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపట్టండి



ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి పనులను తొందరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొయినుద్దీన్ అన్నారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బి.హేమంత్ సహదేవ్‌తో ఎమ్మెల్యే, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బక్రీద్ సామూహిక ప్రార్థనల కోసం ఈద్గా మైదానాలలో ఏర్పాట్లపై, బోనాల పండుగల కోసం చేపట్టాల్సిన పనులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తి చేయడంపై జోనల్ కమిషనతో ఎమ్మెల్యే చర్చించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. – మెహిదీపట్నం

## దేవాలయ నిర్మాణ పనుల పరిశీలన



దేవాలయం పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, జూన్ 8 : గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతి నగర బస్తీలో శ్రీ నల్లపోచమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఇటీవల దేవాలయం అభివృద్ధి కోసం కార్పొరేటర్ ఫ్లోరింగ్ కొరకు గ్రానెట్‌ను సమకూర్చారు. బోనాల పండుగకు ముందే దేవాలయం పనులు పూర్తి అయ్యే విధంగా కమిటీ సభ్యులు చొరువ తీసుకోవాలని సూచించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నాయకులు ఉమేశ్‌కుమార్, రహమత్‌అలీ, ఆనంద్‌రావు, ప్రశాంత్, దేవాలయం కమిటీ సభ్యులు, బస్తీ వాసులు యాదగిరి, లక్ష్మణ్, జీవై గిరి, చెందు, యాదమ్మ, గౌస్ పాల్గొన్నారు.

## బీజేపీ ఓటు బ్యాంకు పెరిగింది



సమావేశంలో మాట్లాడుతున్న జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

సుల్తాన్‌బజార్, జూన్ 8 : జియాగూడ డివిజన్‌లో బీజేపీ ఓటు బ్యాంకు పెరిగిందని ఇందుకు నిదర్శనం ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 19,190 ఓట్లు సాధించిందని జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జె లక్ష్మీనారాయణ, గోల్కొండ జిల్లా బీజేపీ డేయిరీ సెల్ కన్వీనర్ బి. శివకుమార్ యాదవ్‌లు అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలోని లక్ష్మీనర్సింహనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్వాన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పని చేసిన దివంగత బద్దం బాల్‌రెడ్డి హయాం నుండే జియాగూడలో బీజేపీకి మంచి పట్టు లభిస్తూ వచ్చిందని ప్రధానంగా బీజేపీ నుంచి ముగ్గురు కార్పొరేటర్లు గెలుపొందారని అన్నారు. జియాగూడ డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ పటిష్టతకు కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేవైఎం కార్యవర్గ సభ్యులు సంతోష్, డివిజన్ కార్యదర్శి భాస్కర్‌గుప్తా, బీజేవైఎం అధ్యక్షుడు రాజ్‌పాల్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పెరిక వివాహ పరిచయ వేదిక

చిక్కడపల్లి, జూన్ 8 : 25వ ప్రపంచ పెరిక కుల ఉచిత వధూవరుల వివాహ పరిచయ వేదికను ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పరిచయ వేదిక కన్వీనర్ సుంకరి ఆనంద్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పెరిక కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరిచయ వేదికకు గ్రేటర్ సంఘం అధ్యక్షుడు బత్తిని పరమేశ్, మద్దా లింగాయ్య తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శిగా నర్సింగ్‌రావు

అంబర్‌పేట, జూన్ 8 : బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శిగా నల్లకుంట డివిజన్ టీఆర్టీకి చెందిన ఎస్. నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ శనివారం నర్సింగ్‌రావుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఇంతకు ముందు నర్సింగ్‌రావు రెండు పర్యాయాలు ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ఈ పదవి ఇచ్చినందుకు రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్. గౌతంరావు, అసెంబ్లీ కన్వీనర్ శ్యాంరాజ్, మోర్చా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కవాడిగూడ, జూన్ 8: అశోక్‌నగర్ నాలాలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దోమలగూడ పోలీసులు శనివారం తెలిపారు. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం... అశోక్‌నగర్ బ్రిడ్జీ నాలాలో ఓ గుర్తు తెలియని మృత దేహం తేలుతున్నట్లు 100కు ఫిర్యాదు అందడంతో దోమలగూడ పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీసి చుట్టు పక్కల వారిని విచారించినట్లు తెలిపారు. ఎలాంటి సమాచారం తెలియకపోవడంతో గాంధీ దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు (45) సంవత్సరాలు ఉంటుందని, ఎరుపురంగు చెక్స్ చొక్కా, ఖాకీ ప్యాంటు, గోధుమ రంగు బెల్టు, వెనుక భుజంపై పుట్టు మచ్చ, ఎత్తు 5.5 అడుగులు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.